సాక్షి
నిజామాబాద్
శనివారం ♦ 14 ♦ జనవరి ♦ 2023





కోటగిరిలో..

గరిష్టం/కనిష్టం
32.0 /16.6

వాతావరణం

ఉదయం నుంచి చల్లటి గాలులు వీయవచ్చు. ఆకాశం నిర్మలంగా ఉంటుంది. సాయంత్రం నుంచి చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

భోగభాగ్యాల భోగి



- మొదలైన సంక్రాంతి సంబరాలు
- నోములకు సిద్ధమైన మహిళలు
- పండగకు స్వగ్రామాలకు చేరుకున్న ఉద్యోగులు, విద్యార్థులు

జిల్లాలో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న పండుగలో శనివారం భోగి, తర్వాత రెండ్రోజులు సంక్రాంతి, కనుమ నిర్వహించనున్నారు. ఉద్యోగ రీత్యా వివిధ రాష్ట్రాలు, జిల్లాల్లో ఉంటున్నవారు, పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు పండుగకు స్వగ్రామాలకు చేరుకున్నారు. కుటుంబ సభ్యులతో ఆనందంగా పండుగ జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇప్పటికే ప్రతి ఇంట్లో పిండి వంటలు సిద్ధమయ్యాయి. ఎక్కడెక్కడో ఉన్న వారంతా ఒక్కచోటికి చేరడం వల్ల ఉమ్మడి కుటుంబ సంస్కృతి చాటుతోంది. – నిజామాబాద్ సిటీ/కోటగిరి



కోటగిరి మండలంలోని ఓ ఇంట్లో పిండివంటలు చేస్తున్న మహిళలు



ఎత్తొండ క్యాంప్‌లో ముగ్గు వేస్తున్న మహిళలు

గాలిపటాల సందడి

సంక్రాంతి నేపథ్యంలో పతంగుల సందడీ మొదలైంది. వారం రోజుల ముందు నుంచే చిన్నారులు, యువత పతంగులను ఎగరేస్తున్నారు. మార్కెట్‌లో విభిన్న రకాల పతంగులు లభిస్తున్నాయి. ఆకాశంలో పోటీపడి ఎగురుతున్న పతంగులు కనువిందు చేస్తున్నాయి. అయితే ఈ పతంగులు ఎగురేసే సమయంలో ఇళ్ల పైనుంచి పడిపోయన ఘటనలు ఉన్నాయి. చైనా మాంజాలతో ప్రాణాలు కోల్పోయిన వారూ ఉన్నారు.

రెడీమేడ్ పిండివంటకాలకు డిమాండ్..

జిల్లాలో రెడీమేడ్ పిండి వంటకాలకూ డిమాండ్ పెరిగింది. ఉద్యోగాలు చేస్తున్న నేటితరం మహిళలు కొంతమంది ఉరుకులు, పరుగుల జీవితంలో పిండి వంటకాల తయారీకి సమయం వెచ్చించలేక పోతున్నారు. రెడిమేడ్ పిండి వంటకాలపై ఆధార పడక తప్పడం లేదు.

ఆధ్యాత్మికం, ఆరోగ్యాల కలయిక...

రాబోయే ఉత్తరాయణంలో సుఖ సంతోషాలను ఇమ్మని కోరుతూ వేసే మంటలనే భోగి మంటలు అంటారు. ఈ భోగి మంటల్లో ఆధ్యాత్మికత, ఆరోగ్యాల కలయిక ఉంది. ధనుర్మాసం నెలంతా ఇంటి ముందు పెట్టిన గొబ్బెమ్మలను పిడకలుగా చేస్తారు. వాటినే ఈ భోగి మంటలలో వాడతారు. దేశీ ఆవు పేడ పిడకలని కాల్చడం వల్ల గాలి శుద్ధి అవుతుంది. సూక్ష్మ క్రిములు నశిస్తాయి. ప్రాణ వాయువు గాలిలోకి అధికంగా విడుదలవుతుంది. దీని గాలి పీల్చడం ఆరోగ్యానికి మంచిది. భోగి మంటల్లో రావి, మామిడి, మేడి మొదలైన ఔషధ చెట్ల బెరడ్లు వేస్తారు. భోగి రోజున చిన్నపిల్లల తలపై రేగు పండ్లు పోసి ఆశీర్వదిస్తారు. రేగు పండ్లలో రక్తాన్ని శుద్ధి చేసే గుణం ఉంటుంది.

కష్టాలన్నీ మర్చిపోయి ఆనందంగా ఉంటాం



ఈ పండుగ సందర్భంగా ఇంటిల్లిపాది కష్టాలన్నింటిని మర్చిపోయి పండుగకు వారం రోజుల ముందు, తర్వాత వారం రోజుల పాటు ఆనందంగా గడుపుతాం. విజయవాడ నుంచి మా బంధువులు వస్తారు. వచ్చిన బంధువుల మాటామంతీతో మా కుటుంబాల మధ్య అనుబంధాలను మరింత పెరుగుతుంది. పండుగతో ఇల్లు మరింత శోభను సంతరించుకుంటుంది. – వట్టికొండ శివలీల, పోతంగల్

సంప్రదాయ బద్ధంగా జరుపుకుంటేనే..



ఇటీవల పండుగలను సాంప్రదాయ బద్ధంగా జరుపుకోకుండా ఫ్యాషన్‌గా, విపరీతపోకడలతో రెడీ మేడ్ పద్ధతుల్లో జరుపుకోవడం వల్ల పండుగ కళ తప్పుతోంది. భోగి మంటల్లో ఔషధ లక్షణాలున్న చెట్ల కొమ్మలు, బెరడ్లు వేయకుండా టైర్లు, ఇంట్లో వృథాగా పడివున్న వస్తువులను కాల్చడం ఫలితంగా మన ఆరోగ్యానికి హాని కలుగుతోంది. మన పండుగలు శాస్త్రీయ విజ్ఞానాన్ని బోధిస్తున్నాయి. – నూరినేని సునీత

ఈసారి అమ్మకాలు ఎక్కువగా ఉన్నాయి..



గత సంవత్సరంతో పోల్చితే నిత్యావసరాల ధరలు పెరగటంతో ఈసారి పిండి వంటకాల ధరలు పెరిగాయి. అయినప్పటికీ ఈ సంవత్సరం అమ్మకాలు బాగానే ఉన్నాయి. ఒక్క సంక్రాంతి పండగనే కాకుండా అన్ని పండగలకు పిండి వంటకాలకు గిరాకీ బాగానే ఉంటుంది. – నరేష్, పిండి వంటల వ్యాపారి

తీరిక లేక పిండి వంటకాల కొనుగోలు



ఒకప్పుడు ఇంట్లోనే వివిధ రకాల పిండి వంటకాలు చేసేవారు. ఇప్పుడు చేసేంత తీరిక ఉండటం లేదు. ఇంట్లో చేసిన పిండి వంటకాల వలే రుచికరంగా ఉండటంతో కొనుగోలు చేసి తీసుకెళ్తున్నాం. – రాములు, ఉద్యోగి

న్యూస్‌రీల్

గుండె జబ్బుతో ఉన్న గర్భిణికి వైద్యం

- కట్నం పెట్టి డిశ్చార్జ్ చేసిన సూపరింటెండెంట్ ప్రతిమరాజ్



నిజామాబాద్ సిటీ : ప్రసవం కోసం వచ్చిన ఓ గర్భిణికి గుండె జబ్బు విషయం బయటపడింది. వస్తే గుండె రోగం బయటపడింది. దీంతో అప్రమత్తమైన ప్రభుత్వ వైద్యులు రెండురోజుల పాటు ఆ బాలింతను కంటికి రెప్పలా కాపాడి ప్రాణాలు నిలిపారు. దీంతో ఆ గర్భిణి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మురిసి పోయిన ఆ తల్లి తన బిడ్డకు జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమరాజ్ పేరునే పెట్టుకుంది. వివరాలిలా ఉన్నాయి. డిచ్‌పల్లి మండ లం ధర్మారం గ్రామానికి చెందిన నరేందర్ తన భార్య సౌందర్యకు ప్రసవం కోసం ఈ నెల 1న జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు గుండె సంబంధిత స మస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఆమెకు ఆపరేషన్ చేయగా ఆడబిడ్డ జన్మించినప్పటికీ తల్లి ప్రాణాలకు మాత్రం వైద్యులు మొదట భరోసా ఇవ్వలేకపోయారు. దీంతో బాలింత సంబంధీకులు బిడ్డకు తల్లిలేని లోటు ఉంటుందని ఎలాగైనా తల్లి ప్రాణాలు కా పాడాలని జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను కోరగా ఆమె ప్రత్యేక చొరవ తీసుకుని ఎక్కడికి రిఫర్ చేయకుండా జీజీహెచ్‌లో గుండె సంబంధిత చికిత్స చేసి బాలింత ప్రాణాలు కాపాడారు. దీంతో ఆమె కుటుంబసభ్యులు సూపరింటెండెంట్ ప్రతిమరాజ్‌కు, వైద్యబృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. శుక్రవారం సూపరింటెండెంట్ ఆ తల్లికి చీరను కట్నంగా అందజేసి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు.

బియ్యం కుంభకోణంపై విచారణ జరపాలి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలో జరిగిన బియ్యం కుంభకోణంపై ప్రభుత్వం తక్షణమే విచారణ చేపట్టాలని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ సుంకేట అన్వేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బియ్యం కుంభకోణంతో సంబంధం ఉన్న ఎమ్మెల్యే ఎవరో ప్రభుత్వం చెప్పాలన్నారు. డీఎస్‌వోగా, డీఎంగా ఒకరే ఎలా బాధ్యతలు నిర్వర్తిస్తారన్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి ధాన్యం కొనుగోలు, ఎఫ్‌సీఐకి ఇచ్చే బియ్యంలో అవకతవకలకు పాల్పడుతున్నారన్నారు. జిల్లాలో డీఎస్‌వో ఒకరకంగా, డీసీవో మరో రకంగా దోపిడీ చేస్తున్నారన్నారు. డీసీవో మంత్రి కనుసన్నల్లో పనిచేస్తూ సహకార సంఘాలన్నింటినీ నిర్వీర్యం చేస్తున్నాడన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులకు నష్టం జరిగినట్లు ఆధారాలతో సహా చూపినప్పటికీ రైతులకు న్యాయం చేయలేదన్నారు. డీసీవోపై విచారణ చేయాలన్నారు. గతంలో తాళ్ల రాంపూర్ సహకార సంఘం, తాజాగా బ్రాహ్మణపల్లి సహకార సంఘం విషయంలో ఎప్పటికప్పుడు ఆడిట్ చేస్తున్న అధికారులు ఏం చేస్తున్నారన్నారు. ఇటీవల బ్రాహ్మణపల్లి సహకార సంఘంలో నిందితులుగా ఉన్న అప్పటి చైర్మన్, సెక్రెటరీలను బాధ్యులను చేస్తూ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. సహకార సంఘాల పనితీరు విషయమై డీసీవోనే బాధ్యత వహించాలన్నారు.

శ్రీకాంత్ కుటుంబానికి న్యాయం చేయాలి



బోధన్ : మండలంలోని ఖండ్‌గాంలో మృతి చెందిన డిగ్రీ విద్యార్థి శ్రీకాంత్(22) కుటుంబానికి న్యాయం చేయాలని, మృతి కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ మహారాష్ట్ర ప్రాంతం శివ సంఘటన (వీరశైవ లింగాయత్), అఖిల భారతీయ వీరశైవ యువసంఘటన జాతీయ కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం బోధన్‌లో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. కళాశాలకు వెళ్లిన శ్రీకాంత్ గతేడాది సెప్టెంబర్ 23న అదృశ్యమై 80 రోజులనంతరం పట్టణ శివారులోని కుళ్లి పోయిన మృతదేహంగా లభ్యమైన సంఘటన తెలిసిందే. మహారాష్ట్ర ప్రాంతం నాందేడ్, ఇతర జిల్లాల నుంచి వందలాది మంది శివ సంఘటన కార్యకర్తలు బైక్ ర్యాలీగా బోధన్ తరలివచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల వీరశైవ లింగాయత్ సమాజ్ నాయకులు, సభ్యులు వారి వెంట నడిచారు. శివసంఘటన జాతీయ అధ్యక్షుడు మనోహర్ దోండే ఆధ్వర్యంలో ఆర్డీవో రాజేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

బూత్‌స్థాయి కార్యకర్తలే బీజేపీకి అండ



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

- వారితోనే త్వరలో అధికారం
- పారదర్శకతకు మాస్టర్ ప్లాన్లు ప్రజల ముందుంచాలి
- ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్ : బూత్‌స్థాయి కార్యకర్తలే బీజేపీకి బలమని, వారితోనే పార్టీ అధికారంలోకి వస్తుందని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 1.79 లక్షల ఇళ్లు కట్టామని మంత్రి హరీష్‌రావు ప్రకటించారని, ఇటీవల జగిత్యాల్‌లో నిర్మించిన ఇళ్లల్లో 40 శాతం ముస్లింలకు పంపిణీ చేశారని, ఎలా ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే ఖాళీ ప్లాట్ ఉండి ఇల్లు నిర్మించుకుంటే గతంలో రూ.5 లక్షలు ఇస్తామన్నారని, తాజాగా రూ. 3 లక్షలే ఇస్తామంటున్నారన్నారు. ఇందుకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. ఆయూష్మాన్ భారత్ పథకాన్ని పకడ్బందీగా అమల్జేస్తే ఎవరి కాళ్లు మొక్కాల్సిన అవసరం లేదని మంత్రికి హితవు పలికారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బీజేపీ నాయకులకు కళ్యాణలక్ష్మి చెక్కులు నిలిపేయడంపై ఎంపీ స్పందిస్తూ అసలు ఆయన నాలుగు సార్లు ఎలా ఎమ్మెల్యే అయ్యాడో అర్థంకావడం లేదన్నారు. నిజామాబాద్‌లో కూడా తాజా మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్ బహిర్గతం చేయాలన్నారు. లోక్‌సభకు తనపై పోటీ చేయాలని ఎమ్మెల్సీ కవితకు ఎంపీ సవాల్ విసిరారు. బియ్యం దందాలో ఎమ్మెల్యేల హస్తముందనే ఆరోపణలున్నాయన్నారు. అర్వింద్ ధర్మపురి ఫౌండేషన్ ద్వారా 15 నెలల్లో సుమారు 45 మంది బూత్‌స్థాయి కార్యకర్తలకు రూ. 29.16లక్షల ఆర్థి కసాయం అందించానన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త తదితరులున్నారు.

బస్టాండ్ నిర్మాణానికి రంగం సిద్ధం

- మౌలిక సౌకర్యాలతో పాటు మరిన్ని సేవలు
- రీజియన్‌కు కొత్తగా 30 బస్సులు
- కార్గో సేవలు మరింత విస్తృతం చేస్తాం
- 'సాక్షి'తో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చొరవతో నిజామాబాద్ రీజియన్ పరిధిలో ఆర్టీసీ సేవలు మరింత విస్తృతం చేస్తున్నారు. ఇక నిజామాబాద్ నగరంలో కొత్తగా రూ. 10 కోట్లతో బస్‌స్టేషన్‌ను అత్యాధునికంగా నిర్మించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం స్థల సేకరణ పూర్తికావచ్చింది. ఈ బస్‌స్టేషన్ నుంచి రైల్వే స్టేషన్‌లోకి నేరుగా వెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు. అలాగే ఉమ్మడి జిల్లాలోని ఆరు డిపోలకు కొత్తగా 30 బస్సులను పంపేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇప్పటికే కొన్ని బస్సులు వచ్చాయి. దీంతో ఆరు డిపోల్లో కలిసి బస్సుల సంఖ్య 434కు చేరనుంది. ఇప్పటికే శబరిమలై, ఇతర శుభకార్యాలు, తీర్థయాత్రలకు సంబంధించి ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇస్తున్నారు. ఇది సత్ఫలితాలను ఇస్తోంది. దీంతో ఆర్టీసీపై నమ్మకం మరింత నమ్మకం పెంచేదిశగా ముందుకు వెళ్తున్నారు. అదే విధంగా జిల్లాలో అన్ని మండల కేంద్రాల నుంచి ఆర్టీసీ కార్గో సేవలను అందిస్తున్నారు. ఈ కార్గో సేవలను మరింత విస్తృతం చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. జిల్లాలో వ్యవసాయం ఎక్కువగా ఉండడంతో పాటు కూరగాయల సాగు ఎక్కువగా ఉంటోంది. దీంతో ఆయా మండలాల నుంచి కార్గో బస్సుల ద్వారా కూరగాయల తరలింపుకు అవకాశాలు పెరుగనున్నాయి. ఇదిలా ఉండగా జిల్లాలోని జక్రాన్‌పల్లి, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ధర్పల్లి, ఇందల్వాయి, మాక్లూర్, నందిపేట్, సిరికొండ, రెంజల్, భిక్కనూర్, దోమకొండ, లింగంపేట్, బిచ్కుంద, మద్నూర్, నిజాంసాగర్, పిట్లం, రుద్రూర్, వర్ని, బోధన్, కామారెడ్డి, బాన్సువాడ, నిజామాబాద్ బస్‌స్టేషన్లలో ప్రహరీలు, సీసీరోడ్లు, మరుగుదొడ్లు, ఇతర మరమ్మతుల కోసం రూ. 7.50 కోట్లు మంజూరు చేసినట్లు చైర్మన్ బాజిరెడ్డి తెలిపారు.

నష్టాల నుంచి లాభాల్లోకి..

ఇప్పటికే మండల కేంద్రాల నుంచి కార్గో సేవలు అందిస్తున్నాం. వీటిని మరింత విస్తృతం చేయనున్నాం. కార్గో అనేది రైల్వేకు గూడ్స్ లాగా ఉపయోగపడనుంది. కార్గో సేవలనేవి ఆర్టీసీ అభివృద్ధికి మేలిమలుపు. రూ. 1,500 కోట్ల నష్టంలో ఉన్న ఆర్టీసీలో వివిధ సంస్కరణలు, కార్గో సేవల ద్వారా ఆ నష్టాలను రూ.300 కోట్లకు తగ్గించడం జరిగింది. లాభాల దిశగా ముందుకెళ్తున్నాం. సీఎం కేసీఆర్ ఏటా ఆర్టీసీకి రూ. 1,500 కోట్లు కేటాయిస్తున్నారు. ఇక తెలంగాణ ఆర్టీసీ ద్వారా ప్రతిరోజూ తిరుపతి బస్సుల్లో వెళ్లేవారికి వెయ్యి ప్రత్యేక దర్శనం లెటర్లు ఇస్తున్నాం. వీటికి మంచి స్పందన వస్తోంది. నిజామాబాద్ రీజియన్‌లో ఆర్టీసీ సేవలను మరింత విస్తృతం చేసేదిశగా ప్రత్యేక దృష్టి సారిస్తున్నా.

ఆ ఒక్కటి అడక్కు..



- రైతుబంధు వివరాలను గోప్యంగా ఉంచుతున్న ప్రభుత్వం
- బయటికి చెప్పేందుకు జంకుతున్న వ్యవసాయాధికారులు
- ఇప్పటిదాకా ఆరెకరాల్లోపు రైతులకే అందిన సాయం
- కొత్త రైతుల వివరాలను ఇంకా ఆన్‌లైన్ చేయని సర్కారు

ఇందూరు(నిజామాబాద్ అర్బన్) : రైతుబంధు వివరాలను రాష్ట్ర ప్రభుత్వం గోప్యంగా ఉంచుతోంది. బయటకు చెప్పకూడదని వ్యవసాయాధికారులను కట్టడి చేసింది. బయటి వ్యక్తులకే కాదు మీడియాకు కూడా వివరాలను వెల్లడించడానికి అధికారులు జంకుతున్నారు. ఉద్యోగాలు పోతాయనేంతగా భయంతో 'ఆ ఒక్కటి అడక్కు' అని మాట దాటేస్తున్నారు. దీంతో జిల్లాలో ఏడాది యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతుబంధు నిధులు ఎంతమందికి వచ్చాయన్న లెక్కలు తెలియని పరిస్థితి నెలకొంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యంగా రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం వేస్తుండడమే ఇందుకు కారణమని మాత్రం తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 28 నుంచి రైతుబంధు సాయం అందజేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లాలో కొత్తగా 7,176 మంది రైతులను కలుపుకొని లబ్ధిదారుల సంఖ్య 2,78,351 మందికి చేరుకుంది. ఇందుకు రూ.274.10కోట్లకు పైగా పెట్టుబడి సాయం అవసరమవుతోంది. తొలుత ఒకటి, రెండు, మూడెకరాలు వారికి పెట్టుబడి డబ్బులు అందగా, నాలుగు నుంచి ఆరెకరాల్లోపు ఉన్న రైతులకు ఆలస్యంగా అందాయి. ప్రస్తుతం ఆరు ఎకరాలకు పైగా ఉన్న వారికి ఇంకొంత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో పక్షం రోజులవుతున్నా తమకు రైతుబంధు రాలేదని రైతులు వ్యవసాయాధికారులకు ఫోన్లు చేస్తున్నారు. కొంత ఆలస్యమైనా డబ్బులు తప్పకుండా పడతాయని అధికారులు వారికి సముదాయిస్తున్నారు. కానీ, వరినాట్లు దాదాపు పూర్తయినప్పటికీ పంట సాయం అందకపోవడం పట్ల రైతులు ఆందోళనగా ఉన్నారు. ఎరువులు, మందుల కొనుగోలుకు చేతిలో పైసల్లేక అప్పు తెచ్చుకుంటున్నారు.

కొత్త రైతులకు అనుమానమే..

జిల్లాలో రైతుబంధు పొందే లబ్ధిదారుల జాబితాలో కొత్తగా పట్టాపాసు పుస్తకాలు పొందిన 7,176 మంది రైతులను చేర్చింది. అర్హత ఉన్న రైతులు రైతుబంధు కోసం దరఖాస్తుతో పాటు పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్, ఆధార్ జిరాక్స్‌లను మండల వ్యవసాయాధికారులకు అందజేశారు. అయితే, ప్రభుత్వం మాత్రం ఆ రైతుల పేర్లను మాత్రం రైతుబంధు పోర్టల్‌లో ఇంకా నమోదు చేయలేదు. దీంతో వ్యవసాయాధికారులు రైతుల వివరాలను ఎంట్రీ చేయలేకపోతున్నారు. వచ్చిన దరఖాస్తులన్నీ మండల కార్యాలయాల్లోనే పడున్నాయి. తద్వారా కొత్త రైతులకు యాసంగి పెట్టుబడి సాయం ఇప్పట్లో అందే పరిస్థితి కనిపించడం లేదు. సీసీఎల్‌ఏ నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్‌ను కొత్త పాస్‌పుస్తకాలు పొందిన రైతుల వివరాలు అందలేదని తెలుస్తోంది.

రుణాల కోసం దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

నిజామాబాద్‌నాగారం : మైనారిటీ కార్పొరేషన్ ద్వారా వ్యక్తిగత రుణాలకు దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు ఈనెల 16,17 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ చిత్ర మిశ్రా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని న్యూఅంబేడ్కర్ భవనంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అభ్యర్థులు తమ ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు ఒరిజినల్ ధృవపత్రాలు తీసుకొని హాజరుకావాలన్నారు.

ఇందులో నిరుపేదలకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు, స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలకు నిబంధనల ప్రకారం ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఒరిజినల్ ధృవపత్రాలను అధికారులకు చూయించి జిరాక్స్ కాపీలను అందజేయాలన్నారు.

కంటి వెలుగును సక్సెస్ చేయాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి



జిల్లాకు చేరుకున్న కంటి వెలుగు సామగ్రి

సుభాష్‌నగర్ : ఈనెల 18వ తేదీ నుంచి చేపట్టనున్న 'కంటి వెలుగు' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి కోరారు. 18 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరికి కంటి వెలుగు శిబిరాల్లో నేత్ర పరీక్ష నిర్వహించేలా పక్కా ప్రణాళిక రూపొందించామన్నారు. శిబిరాల నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా 70 బృందాలను ఏర్పాటు చేశామని, ప్రతి బృందంలో ఒక మెడికల్ ఆఫీసర్, ఒక ఆప్టోమెట్రిస్ట్ అధికారి, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇద్దరు ఏఎన్‌ఎంలు, ముగ్గురు ఆశా వర్కర్ల చొప్పున మొత్తం ఎనిమిది మంది సభ్యులు ఉంటారన్నారు. ఒక్కో బృందం గ్రామ పంచాయతీ పరిధిలో 118 మందికి, అర్బన్ పరిధిలో 110 మందికి స్క్రీనింగ్ నిర్వహిస్తుందన్నారు. జనాభా ప్రాతిపదికను అనుసరిస్తూ జిల్లాలో సుమారు 12 లక్షల పైచిలుకు మందికి కంటి పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే శిబిరాల నిర్వహణకు అవసరమైన సామగ్రి జిల్లాకు చేరుకోగా, నిర్దేశిత ప్రాంతాలకు చేర్చడం జరిగిందన్నారు. నేత్ర పరీక్షలు జరిపి, అవసరమైన వారికి శిబిరాల్లోనే మందులు, దూరదృష్టి లోపం ఉన్న వారికి కంటి అద్దాలు అందిస్తామన్నారు. ప్రిస్కిప్షన్ అద్దాలు అవసరమైన వారి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారని, పక్షం రోజుల్లోపు వారికి కంటి అద్దాలు ఇంటికి చేర్చేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుందన్నారు. శిబిరాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురి డిబార్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో శుక్రవారం మాల్‌ప్రాక్టీస్ కు పాల్పడుతూ ముగ్గురు విద్యార్థులు డిబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎం.అరుణ తెలిపారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల,ఆర్‌కే డిగ్రీ కళాశాల,ఎస్ఆర్‌కే డిగ్రీ కళాశాల,మంజీరా డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాలను కంట్రోలర్ అరుణ తనిఖీ చేశారు. ఉదయం జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 4,533 మంది విద్యార్థులకు 4278 మంది హాజరయ్యారు.ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో ఒకరు, ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు ఆమె తెలిపారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ ఐదో సెమిస్టరు రెగ్యులర్, ఆరో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 8717 మందికి 8066 మంది పరీక్షలు రాశారని కంట్రోలర్ తెలిపారు.

గ్రూప్స్ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

కామారెడ్డి క్రైమ్: జిల్లాలోని షెడ్యూలు కులాల యువతకు గ్రూప్ 1, 2, 3, 4 పోటీ పరీక్షల కోసం ఉచిత శిక్షణ శిబిరాన్ని మూడు నెలల పాటు ఏర్పాటు చేయనున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారిణి రజిత ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల నాన్ రెసిడెన్షియల్ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. పూర్తి సమాచారం రాబోయే రెండు లేదా మూడు రోజుల్లో ఆన్‌లైన్ ద్వారా గాని, పత్రిక ప్రకటనల ద్వారా గాని తెలియజేస్తామని పేర్కొన్నారు. నిరుద్యోగ ఎస్సీ యువత ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నడుస్తున్న ప్రతిభ కళాశాల (సీవోఈ) ల్లో 2023-24 విద్యాసంవత్సరానికి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ రీజియన్ కోఆర్డినేటర్ మేరీ ఏసుపాదం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరంలో ఏదైనా ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ లకు చెందిన విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని ఆర్‌సీవో తెలిపారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు www.tswreis.in, www.tsswreisjc.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతిభా కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యతో పాటు ఐఐటీ, జేఈఈ, నీట్, ఎంసెట్, క్లాట్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చి 03న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

రౌడీషీటర్ హత్య కేసులో ఒకరి రిమాండ్

ఖలీల్‌వాడి: రౌడీషీటర్ ఇబ్రహీం ఛావుస్ అలియాస్ జంగిల్ ఇబ్బు హత్య కేసులో నిందితుడు ఉస్మాన్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయికుమార్‌గౌడ్ తెలిపారు. ఈ హత్య కేసులో నబీ, రెహమాన్ పరారీలో ఉన్నారు. ఉస్మాన్ బాబా సాహెబ్ పహాడ్‌లోని అటవీ ప్రాంతంలో ఉన్న విషయం తెలుసుకున్న పోలీసులు గురువారం రాత్రి అదుపులోకి తీసుకొని శుక్రవారం కోర్టులో హాజరుపర్చారు.

పోటీలతో వెలుగులోకి సృజనాత్మకత



కలెక్టరేట్ మైదానంలో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు



ముగ్గులను పరిశీలిస్తున్న మేయర్ నీతూకిరణ్, మహిళ కమిషన్ సభ్యురాలు సుదాం లక్ష్మి





నిజామాబాద్‌నాగారం: పోటీల్లో పాల్గొంటేనే మహిళల్లో దాగి ఉన్న ప్రతిభ, సృజనాత్మకత బయటకు వస్తాయని నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూకిరణ్ తెలిపారు. శుక్రవారం నగరంలోని కలెక్టర్ గ్రౌండ్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా మేయర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలో మహిళలు యువతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలకు అద్దం పట్టే పలువురు ముగ్గులు వేశారు. పోటీల్లో గెలుపొందిన వారికి మేయర్ బహుమతులు అంజేశారు. మహిళా కమిషన్ సభ్యురాలు సుదాం లక్ష్మి, డిస్ట్రిక్ట్ ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి సంధ్యారాణి మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించారు. కల్పన మొదటి బహుమతి(రూ.ఐదు వేలు), భవాని రెండో బహుమతి (రూ.మూడు వేలు), జ్యోతి మూడో బహుమతి (రూ.రెండు వేలు) గెలుచుకున్నారు. ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి టిఫిన్ బాక్స్‌లను అందించారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుందాం



ముగ్గులను పరిశీలిస్తున్న ఎంపీ అర్వింద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూర్యనారాయణగుప్తా

సుభాష్‌నగర్: సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. శుక్రవారం నగరంలోని దుబ్బచౌరస్తాలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మహిళా మోర్చా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సనాతన ధర్మం, హిందువుల పండుగలను వెలికితీసే విధంగా బీజేపీ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. అనంతరం విజేతలకు ఎంపీ బహుమతులు ప్రదానం చేశారు. అలాగే ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి కిసాన్ ఫ్యాషన్ మాల్ ఆధ్వర్యంలో చీరలను ప్రోత్సాహక బహుమతులుగా అందించారు. ముగ్గుల పోటీలకు సహాయ సహకారాలు అందించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాకు మహిళా మోర్చా ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గోపిడి స్రవంతిరెడ్డి, పంచరెడ్డి ప్రవళిక, ఇప్పకాయల సుమిత్ర, మోహన్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, జ్యోతి, లక్ష్మీనారాయణ, మాస్టర్ శంకర్, ఎర్రం సుధీర్, భరత్ భూషణ్ పాల్గొన్నారు.



తల్లిని దైవంగా భావించాలని వేసిన ముగ్గు

జిల్లా ప్రజలకు మంత్రి, కలెక్టర్ సంక్రాంతి శుభాకాంక్షలు

సుభాష్‌నగర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి జిల్లా ప్రజలకు వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. భోగ భాగ్యాలనిచ్చే భోగి, సరదాలు పంచే సంక్రాంతి వేడుక ప్రజలందరికీ మరింత ఆనందం పంచాలని ఆకాంక్షించారు.

శుభాకాంక్షలు తెలిపిన సీపీ

ఖలీల్‌వాడి: జిల్లా ప్రజలకు సీపీ నాగరాజు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఇంటిల్లిపాది అంగరంగ వైభవంగా పండుగను జరుపుకోవాలన్నారు. ప్రజలందరు వారి కుటుంబ సభ్యులు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

సెలవులో పోలీస్ కమిషనర్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనర్ నాగరాజు నాలుగు రోజుల పాటు వ్యక్తిగత సెలవులో వెళ్లారు. ఈనెల 12 నుంచి 15 వరకు ఆయన సెలవులో ఉంటారు. ఆయన స్థానంలో కామారెడ్డి ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

కిరాణ దుకాణంలో చోరీ

ఇందల్వాయి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో రాత్రిపూట దొంగతనాలు సర్వసాధారణంగా మారాయి. కిరాణ షాపులతో పాటు, పొలాల వద్ద నిలిపి ఉంచిన ట్రాక్టర్ల బ్యాటరీలు, డీజిల్, పార్క్ చేసిన బైక్‌లు, అందులోంచి పెట్రోల్ పోతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బుధవారం రాత్రి ఇందల్‌వాయిలోని ఎక్స్‌ప్రెస్ కిరాణషాపులో దొంగలు రూ.ఆరు వేల నగదు, రూ.5 వేల విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు షాపు యజమాని జితేందర్ తెలిపారు. నల్లవెల్లి గ్రామంలో పిప్పెర రాజన్నకు చెందిన ట్రాక్టర్ నుంచి 8 వేల విలువైన బ్యాటరీని ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు.

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

SAKSHI / SAKSHI DIGITAL / MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

SUDHAKAR PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY
Regional sponsor

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్టు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్లు వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు : 9010418884

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

చదువుతోనే మంచి భవిష్యత్



మాట్లాడుతున్న డీఐఈవో రఘురాజ్

డిచ్‌పల్లి: చదువు ద్వారానే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి (డీఐఈవో) లోలం రఘురాజ్ అన్నారు. శుక్రవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. వార్షిక పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డీఐఈవో బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రవిఠల్, జిల్లా ప్రిన్సిపాల్స్ సంఘం అధ్యక్షుడు చిరంజీవి, నర్సయ్య, ప్రిన్సిపాల్స్ రజియోద్దీన్ (ధర్పల్లి), చిన్నయ్య (బాల్కొండ) పాల్గొన్నారు.

రాష్ట్ర సీనియర్ సాఫ్ట్‌బాల్ మహిళల ఛాంపియన్ నిజామాబాద్



డిచ్‌పల్లి: నిర్మల్‌లో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర సీనియర్ మహిళల సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఛాంపియన్‌గా నిజామాబాద్ జట్టు నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సిద్దిపేట జట్టుపై 1-0 పరుగుల తేడాతో గెలుపొంది టోర్నీ ఛాంపియన్‌గా నిజామాబాద్ జట్టు నిలిచినట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.ప్రభాకర్ రెడ్డి, ఎం.గంగామోహన్ తెలిపారు. ఈ టోర్నీలో బెస్ట్ పిక్చర్‌గా ఎల్.రాణి ప్రత్యేక బహుమతిని అందుకున్నారు. కోచ్‌గా వేముల మౌనిక, నరేష్, మేనేజర్‌గా సంతోష్ వ్యవహరించారు.

పోరాటయోధుల చరిత్రను పుస్తకాల్లో చేర్చాలి



పథ సంచలన్‌లో పాల్గొన్న స్వయం సేవకులు

మోపాల్: దేశం కోసం పోరాడిన వీరుల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి భవిష్యత్ తరాలకు అందించాలని వ్యాపారవేత్త నేమాజి నారాయణ అన్నారు. శుక్రవారం నగర శివారులోని బోర్గాం(పి) జెడ్పీహెచ్ఎస్‌లో వీర సావర్కర్ శాఖ వార్షికోత్సవం, సంక్రాంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో పథ సంచలన్ ప్రదర్శించారు. ప్రధాన వక్త గణేశ్ మాట్లాడుతూ సంస్కారవంతమైన సమాజ నిర్మాణం జరగాలని, అది వ్యక్తి నిర్మాణం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంతోపాటు ఎన్నో విపత్కర, అత్యవసర పరిస్థితుల్లో స్వయం సేవకుల పాత్ర కీలకమన్నారు. నగర సంఘ సంచాలక్ శ్రీనివాస్, ఉప నగర కార్యవాహ కల్లెడ వెంకటేష్, స్వయం సేవకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

స్నేహితులను కలిసేందుకు వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



హృషికేష్ మృతదేహం

డిచ్‌పల్లి: వారు ముగ్గురు పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. ఇప్పుడు వేర్వేరు చోట్ల ఇంజినీరింగ్ చదువుతున్నారు. సంక్రాంతి సెలవుల సందర్భంగా శుక్రవారం ముగ్గురు డిచ్‌పల్లిలో కలిశారు. చాలా సేపు కబుర్లతో ఆనందంగా గడిపారు. అనంతరం బైక్‌పై ముగ్గురు కలిసి బయలుదేరారు. ఇంతలోనే వెనకనుంచి వేగంగా వచ్చిన ఐషర్ (మినీ ట్రక్) వీరి బైక్‌ను ఢీకొట్టి కొంతదూరం వరకు లాక్కెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా వారిలో ఒక ఓ యువకుడు మృతి చెందాడు. బాధిత కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖిల్లా డిచ్‌పల్లి గ్రామానికి చెందిన నల్ల అఖిలేష్, ఘన్‌పూర్ గ్రామానికి చెందిన ధీరజ్, ఆర్మూర్ మామిడిపల్లికి చెందిన హృషికేష్‌గౌడ్ (21) స్నేహితులు. హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్న అఖిలేష్ గురువారమే సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చాడు. శుక్రవారం ముగ్గురు స్నేహితులు డిచ్‌పల్లి స్టేషన్‌లో కలుసుకున్నారు. సాయంత్రం వరకు కబుర్లతో ఆనందంగా గడిపారు. అనంతరం సుమారు 5.30 గంటలకు హృషికేష్‌ను ఆర్మూర్‌లో దింపి వచ్చేందుకు అఖిలేష్, ధీరజ్ ఒకే బైక్‌పై బయలుదేరారు. 44వ నంబరు జాతీయ రహదారిపై సుద్దపల్లి శివారులో వెనక నుంచి అతి వేగంగా వచ్చిన ఐషర్ వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే ఐషర్ వాహనం డ్రైవర్ అక్కడి నుంచి వాహనంతో సహా పరారయ్యాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి చేరే సరికి గాయపడ్డ వారిలో హృషికేష్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన అఖిలేష్, ధీరజ్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం వారి కుటుంబీకులు జిల్లా కేంద్రంలోనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని డిచ్‌పల్లి పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు నిర్మల్ టోల్‌ప్లాజా వద్ద అక్కడి పోలీసులు పట్టుకున్నారు.

చెరువులో పడి మహిళ మృతి



సాయవ్వ(ఫైల్)

బాల్కొండ: ముప్కాల్‌కు చెందిన బద్దం సాయవ్వ (52) చెరువులో పడి మృతి చెందింది. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సాయవ్వ కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. ఈ క్రమంలో తరుచు చనిపోతానంటు ఇంట్లో నుంచి వెళ్లిపోయేది. అలానే శుక్రవారం ఉదయం కూడా ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. కుటుంబ సభ్యులు ఉదయాన్నే కనిపించడం లేదని ఫిర్యాదు కూడ చేశారు. శుక్రవారం సాయంత్రం ఊర చెరువులో ఆమె మృతదేహం తేలింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

బిచ్కుంద: కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. కాలనీకి చెందిన హన్మండ్లు అలియాస్ చిన్నా(32) పెయింటర్‌గా పని చేస్తాడు. ఆయన భార్య జ్యోతి జుక్కల్‌లోని కార్మెల్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తుంది. రెండు రోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో జ్యోతి ఇంట్లో ఉన్న వస్తువులు అన్ని తీసుకొని పిల్లలతో కలిసి తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన హన్మండ్లు గోడపై సూసైడ్ నోట్ రాసి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. తన మృతికి భార్య జ్యోతి, అత్త, మామా, బావమరిది, కార్మెల్ స్కూల్ టీచర్ శ్రావణ్ కారణమని, దయచేసి మా అమ్మకు న్యాయం చేయండి అని గోడపై సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతి కారకులైన అందరిపై కేసు నమోదు చేయాలని బంధువులు డిమాండ్ చేశారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

నాటు వేస్తుండగా మీద పడ్డ బండరాయి

- మహిళకు గాయాలు
- బండలను పేల్చడంతో ఘటన

లింగంపేట: పొలంలో బండరాళ్లు తొలగించడానికి మందుపాతర పేల్చగా ఆ రాయి ఎగిరి పడి పొలం పనులు చేస్తున్న మహిళ గాయపడింది. ఈ ఘటన బుధవారం జరగ్గా ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు.. గోపాల్‌పేటకు చెందిన జక్కుల బాల్‌రాజు పంట చేను మండలంలోని లొంకల్‌పల్లి శివారులో ఉంది. ఆయన తన పొలంలో బండరాళ్లు తొలగించడానికి బుధవారం మందుపాతర(బర్మా) పెట్టి పేల్చాడు. అదే సమయంలో సమీపంలో ఉన్న మరొకరి పంట చేనులో వదల్‌పర్తికి చెందిన చిట్యాల సాయవ్వ నాటు వేస్తుండగా మందుపాతర పెట్టి పేల్చిన బండరాయి ఎగిరి వచ్చి ఆమె చేతిపై పడింది. దాంతో చేయి విరిగి తీవ్ర గాయాలు అయ్యాయి. ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మందుపాతర పెట్టిన ఒడ్డె రాజును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న ఇద్దరి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని రైల్వే పోలీసులు పట్టుకొని ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించారు. నగరంలోని బాబాసాహెబ్ పహాడ్‌కు చెందిన షేక్‌జావీద్, షేక్ అబ్బును పట్టుకొని వారి నుంచి వీవో వీ16, రెడ్‌మీ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

కుక్కల దాడిలో ఆరుగురికి గాయాలు

నస్రుల్లాబాద్: బీర్కూర్ ఇందిర కాలనీలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేశాయి. ఆరుగురిపై దాడి చేసి గాయపరిచాయి. బాధితులను కుటుంబ సభ్యులు స్థానిక పీహెచ్‌సీలో చేర్పించారు. గ్రామంలో కుక్కల బెడద తగ్గించాలని స్థానికులు కోరుతున్నారు.

దోమల నివారణ కోసం పొగ..

- మంటలు వ్యాపించి పశువుల కొట్టం దగ్ధం
- రెండు గేదెలకు గాయాలు

మాక్లూర్: దోమల కోసం పశువుల కొట్టంలో పెట్టిన పొగ ద్వారా మంటలు వ్యాపించి గుడిసె కాలిపోయింది. ఈ ఘటనలో కొట్టంలోని రెండు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. వివరాలు.. మండలంలోని గుత్ప గ్రామానికి చెందిన సూరి చిన్న దేవన్న గురువారం రాత్రి తన గేదెలను కొట్టంలో కట్టేశాడు. అనంతరం మేతవేసి, వాటికి దోమలు కుట్టకుండా కొట్టంలో నిప్పుతో పొగపెట్టి నిద్రపోయాడు. అర్ధ రాత్రి సమయంలో గేదెల అరుపులు విని లేచేసరికి కొట్టంలో మంటలు వ్యాపించాయి. రెండు గేదెలు కాలిన గాయాలతో పడి ఉన్నాయి. శుక్రవారం పశు వైద్యాధికారి కిరణ్‌దేశ్ పాండే తన సిబ్బందితో ఘటన స్థలానికి వచ్చి గాయపడ్డ గేదెలకు చికిత్స అందించారు.